# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.*

\- మల్లాది

Talent is Long Patience.

\- Fustav Flallbert

# శ్రీ ఎ.బి.కె.ప్రసాద్

ఆనాటి దినపత్రికల్లో ఒక్క ఆంధ్రపత్రిక తప్ప మిగిలిన అన్ని ప్రముఖ కమర్షియల్ దినపత్రికలకి శ్రీ ఏ.బి.కె ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేసారు. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఈనాడు, ఉదయం, వార్త మొదలైన అన్ని దినపత్రికలకి ఎడిటర్‌గా ఆయన పని చేసారు. వాటిలో ఈనాడు, ఉదయం, వార్త, ఆంధ్రభూమి విజయవాడ ఎడిషన్ దినపత్రికలకి మొదటి ఎడిటర్ ఆయనే. ఓ దినపత్రికని ఆరంభించడానికి తగిన సిబ్బందిని ఎన్నుకుని నియమించుకోవడం, పత్రికకి అవసరం అయిన ఫోటో, గ్రంధాలయ, సమాచార లైబ్రరీలని ఆరంభించడం లాంటివి ఆయన అవలీలగా నిర్వహించారు. ఐతే తను ఆరంభించిన లేదా మధ్యలో చేరిన ఏ దినపత్రికలోనూ ఆయన ఎక్కువ కాలం కొనసాగకుండా, పత్రికా యాజమాన్యంతో అభిప్రాయ బేధాలు వచ్చినప్పుడల్లా ఆయన ఆ దినపత్రికకి రాజీనామా చేసి వెళ్ళిపోతూండేవారు. కారణం ఆయనకి ఆత్మాభిమానం ఎక్కువ. అంతేకాక పత్రిక యాజమాన్యం స్వప్రయోజనాలకి అనుగుణంగా కాక, పాఠకులకి అనుగుణంగా ఆయన ఎడిట్ చేయడానికి ఇష్టపడేవారు. ఇది యాజమాన్యానికి నచ్చదు కాబట్టి ఆయన రాజీపడకుండా బయటకి వచ్చేసేవారు అని ఆయన గురించి బాగా తెలిసిన వారంతా చెపుతారు. ఆయనకి కొందరు జర్నలిస్ట్ శిష్యుల బృందం ఉండేది. వారిలో ప్రధములు శ్రీ వాసుదేవరావు. ఓ పత్రిక నించి ఇంకో పత్రికకి వెళ్ళినప్పుడల్లా వారిని కూడా కొత్త పత్రికలో ఉద్యోగం ఇప్పించి తీసుకెళ్ళేవారని అనేవారు. తనకి కావాల్సిన సిబ్బందిని ఆయన నియమించుకోవడం యాజమాన్యం అంగీకరించేది.



శ్రీ ఎ.బి.కె.ప్రసాద్

1974లో వైజాగ్ ఎడిషన్‌తో ఈనాడు ఆరంభం అయినప్పుడు శ్రీ ఏ.బి.కె దానికి ఎడిటర్, రామోజీరావు చీఫ్ ఎడిటర్‌గా ఉండేవారు. పతంజలి, పొత్తూరి, రాంభట్ల, గజ్జెల మల్లారెడ్డి మొదలైనవారు తొమ్మిది మంది దాకా ఎడిటోరియల్‌లో ఉండేవారు. కాని ఏ.బి.కె అక్కడ ఎక్కువ కాలం కొనసాగకుండా ఆంధ్రప్రభకి ఎడిటర్‌గా వెళ్ళారు. అప్పుడు ఆంధ్రప్రభే అత్యధిక సర్క్యులేషన్‌గల దినపత్రికగా ఉండేది. ఈనాడు ఆరంభం అయిన మూడేళ్ళదాకా అనుకుంటా అది ఆ స్థానాన్ని ఆక్రమించలేదు. ఈనాడుకి పూర్వం దినపత్రికల్లోని భాష సామాన్యులకి అందుబాటులో ఉండేది కాదు. కానీ ఈనాడులో వాడిన భాష ఆటో డ్రైవర్‌కి, లారీ క్లీనర్‌కి కూడా అర్థమయ్యే రీతిలో ఉండటం ఈనాడు సర్క్యులేషన్ పెరగడానికి ఓ కారణం. పత్రికా భాష విషయంలో ఈనాడు పెట్టిన ఒరవడిని ఆ తర్వాత అన్ని దినపత్రికలూ అనుసరించాయి.

శ్రీ నండూరి రామ్మోహనరావు ఆంధ్రజ్యోతి దినపత్రిక నుంచి రిటైరయ్యాక ఆంధ్రజ్యోతి హెడ్ క్వార్టర్స్‌ని విజయవాడ నుంచి హైదరాబాద్‌కి షిఫ్ట్ చేసారు శ్రీ ఏ.బి.కె ఆంధ్రజ్యోతికి ఎడిటర్ అయ్యారు. అవి నవలా ప్రభంజపు రోజులు. ఆంధ్రజ్యోతిలో డైలీ సీరియల్ ఆరంభించాలనుకుని దాని యం.డి జగదీష్ ప్రసాద్ నాకు కబురు చేసారు. ఆ మీటింగ్‌లో శ్రీ ఏ.బి.కె ప్రసాద్‌ని నాకు పరిచయం చేసారు. ఎయిర్ హోస్టెస్ అనే సీరియల్ థీం చెప్పాను. దాన్ని శ్రీ ఏ.బి.కె ఓకే చేసారు. ఆ తర్వాత ఆంధ్రజ్యోతి దినపత్రికని కూడా ఏ.బి.కె వదిలేసారు. 1978లో అనుకుంటా శ్రీ ఏ.బి.కె ప్రభుత్వ మాసపత్రిక ఆంధ్రప్రదేశ్‌కి కూడా ఎడిటర్‌గా పనిచేసారని గుర్తు. ఏ.బి.కె

ఎడిటర్‌గా ఉదయం డైలీ మొదలయ్యాక అది ఆ నాటి అతి ఎక్కువ సర్క్యులేషన్‌గల ఈనాడుకి గట్టి పోటీగా ఉండేది. ఆంధ్రభూమి విజయవాడ ఎడిషన్ ఆరంభించినప్పుడు దానికి ఎడిటర్‌గా శ్రీ ఏ.బి.కె పనిచేసారు.

ఆ తర్వాత సుప్రభాతం అనే సోషియో పొలిటికల్ పక్షపత్రికకి శ్రీ ఏ.బి.కె ఎడిటర్ అయ్యారు. దీన్ని విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత రత్తయ్య 1988లో స్థాపించారు. బషీర్‌బాగ్‌లో బాబూఖాన్ ఎస్టేట్‌లో వారి ఆఫీస్ ఉండేది. శ్రీ ఏ.బి.కె నాకు కబురు చేసి, సుప్రభాతంకి సీరియల్ అడిగితే, 'జాబిలి మీద సంతకం' అనే లేడీస్ ఓరియంటెడ్ సీరియల్ థీమ్‌ని చెపితే అది ఆయనకి నచ్చింది. ఆ సందర్భంలో పారితోషికం గురించి మాట్లాడటానికి ఒకటి, రెండు సార్లు సుప్రభాతం యజమాని శ్రీ రత్తయ్యని కలిసాను. ఆ సీరియల్‌కి ముప్పైవేలు పారితోషికం. సగం అడ్వాన్స్ ఇచ్చారు. నెలనెలా సీరియల్ ఇవ్వడానికి వెళ్ళినప్పుడు శ్రీ ఏ.బి.కె గారిని కలిసేవాడిని. ఓ సంచికలో డయాబెటిస్ రోగం గురించి రాస్తే 'యు ఆర్ ప్రజెంటింగ్ సమ్ థాట్‌ఫుల్ మెటీరియల్' అన్నారు. ఆ సీరియల్ పూర్తి కాకుండానే ఓ రోజు ఏ.బి.కె నాకు ఫోన్ చేసి తను సుప్రభాతం వదిలి వెళ్ళిపోతున్నానని, నా పారితోషికం బేలన్స్ నాకు చెల్లించమని నోట్ రాసి పెట్టానని చెప్పారు. నాకు ఆశ్చర్యం వేసింది. నా పారితోషిక విషయం గుర్తుంచుకుని ఆయన ఆ పని చేయాల్సిన అవసరం లేకపోయినా చేయడం వల్ల నాకు ఈ సంగతి ఇంకా గుర్తుంది. ఆయన నోట్‌ని రత్తయ్యగారు అగౌరవపరచలేదు. నాకు మిగిలిన పదిహేను వేలు అందాయి. నిజానికి భారీ దినపత్రికలకి ఎడిటర్‌గా పనిచేసాక ఇలాంటి చిన్న పత్రికకి ఎడిటర్ అవడం అంటే శ్రీ ఏ.బి.కె ఓ మెట్టు దిగడమే అని చాలామంది అభిప్రాయపడ్డారు. ఆయన వెళ్ళిపోయినా శ్రీ వాసుదేవరావు సుప్రభాతంలో కొద్దికాలం కొనసాగారు.

వార్త అనే దినపత్రికని శ్రీ ఏ.బి.కె ప్రసాద్ తన మిత్రులతో కలసి స్థాపిస్తున్నారని 1995-96లో వినికిడి వచ్చింది. ఆనాటి విజయభాస్కర రెడ్డి ఇప్పుడు వార్త ఆఫీస్ ఉన్న స్థలాన్ని శ్రీ ఏ.బి.కెకి పాత్రికేయుడనే భావంతో తక్కువ ధరకి ఇచ్చారు. వార్త ఆఫీస్ సోమాజీగూడాలో ఉండేది. త్వరలోనే వార్త ఆరంభమైంది. ఆ రోజుల్లో చాలామంది ఎద్దేవాగా ఇలా అన్నారు. 'ఏ పత్రికైనా స్థాపించడమే ఆయన వంతు. ఆ తర్వాత ఎక్కువ కాలం ఉండరు.' వారు అన్నట్లుగానే రెండున్నర - మూడేళ్ళకి యథాప్రకారం శ్రీ ఏ.బి.కె బహుశా భాగస్వాములతో రాజీపడక అనుకుంటా వార్త నుంచి నిష్క్రమించారు. వార్త గిరీష్ సంఘీ చేతుల్లోకి వెళ్ళి ఇంకా అంతరాయం లేకుండా వస్తోంది.

2001లో శ్రీ చలసాని ప్రసాదరావు మాటల్లో కొండాపూర్ లోని శ్రీ చండ్ర పుల్లారెడ్డి ఓల్డేజ్ హోంకి తను వెళ్ళి చూసి వచ్చానని చాలా బాగా నడుస్తోందని చెప్పారు. కేవలం కమ్యూనిస్ట్ నేపథ్యం ఉన్నవారికి మాత్రమే అందులో ప్రవేశం అని చెప్పారు. నా మిత్రుడు, సినీ దర్శకుడు శ్రీ బీరం మస్తాన్ రావు, ఆయన భార్య నవీన లక్ష్మికి సంతానం లేదు. 2003 ప్రాంతంలో వారు ఓల్డేజ్ హోంలో చేరాలనే ఆలోచనలో ఉన్నామని చెపితే, వారికి ఆ ఓల్డేజ్ హోం గురించి చెప్పాను. ఎందుకంటే గుంటూరులో మస్తాన్ రావు కమ్యూనిస్ట్ పార్టీకి కొంత సేవ చేసారు. ప్రజా నాట్యమండలిలో ఏక్టివ్‌గా ఉండేవారు. కాబట్టే ఆయనకి అక్కడ చేరడానికి అర్హత ఉంది. నవీనలక్ష్మి కూడా ప్రజా నాట్యమండలిలో సభ్యురాలు. దాంతో అంతా కలిసి ఆ ఆశ్రమాన్ని చూడటానికి ఓ రోజు వెళ్ళాం. మేనేజర్ డిపాజిట్‌గా లక్ష కట్టాలని, నెలనెలా కొంత మొత్తం కట్టాలని మస్తాన్ రావుకి చెప్పారు. మేమంతా ఆశ్రమం చూస్తుంటే, మొదటి గదిలో శ్రీ ఏ.బి.కె ప్రసాద్ కనిపించారు. నన్ను గుర్తుపట్టకపోతే పేరు చెప్పి నేనే పరిచయం చేసుకున్నాను.

ఆయనకి జూబ్లి హిల్స్ జర్నలిస్ట్ కాలనీలో స్వంత ఇల్లుంది. ఐనా ఆ హోమ్‌ని కట్టేప్పుడే తన కోసం ఓ గదిని డబ్బిచ్చి నిర్మింపచేసుకున్నానని, స్వచ్ఛందంగా భార్యతో సహా అందులో చేరానని చెప్పారు. ఆవిడ అప్పుడు అక్కడ లేరు. పిల్లల దగ్గరకి వెళ్ళారని చెప్పినట్లు గుర్తు. టి.వి, కంప్యూటర్, ఇంటర్నెట్, చిన్న గ్రంథాలయం, ఫోన్ సౌకర్యాలు గల ఆ గది ఎంతో ముచ్చటగా ఉంది. ఆయన అప్పుడు ఓ పుస్తకం రాస్తున్నానని, రిటైర్మెంట్ లైఫ్ గడుపుతున్నానని చెప్పారు. ఆ ఆవరణలోని అనేక రకరకాల పూల కుండీలని చూసి

బావున్నాయని చెపితే, వాటిని ఏ.బి.కె గారి భార్య పెంచుతున్నారని ఆమెకి గార్డెనింగ్ అంటే అభిరుచి అని ఆశ్రమవాసులు చెప్పారు. శ్రీ ఏ.బి.కె ప్రసాద్‌ని ఆ తర్వాత నేను మళ్ళీ కలవలేదు.

ఆ తర్వాత ఆంధ్రప్రభ దినపత్రిక చేతులు మారాక ఆయన అందులో మళ్ళీ ఎడిటర్ గా చేరారు. కొద్దికాలం ఆశ్రమం నుంచే ఆఫీస్‌కి వచ్చి వెళ్ళేవారని విన్నాను. ఆ తర్వాత ప్రభలో కూడా మానేసారు. శ్రీ ఏ.బి.కె ఉద్యోగం అయినా త్యాగం చేస్తారు కానీ, తన ఆదర్శాలని మాత్రం వదులుకోని, మొక్కవోని ధైర్యంగల మనిషి. శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు కూడా ఇంతే. ఇలాంటి ఎడిటర్లు నేడు లేరనే చెప్పాలి. యాజమాన్యం వ్యాపార ప్రయోజనాలకి అనుగుణంగా పత్రికని నడిపే ఎడిటర్స్, ప్రభుత్వాలని శాసించే యాజమాన్యం గల వ్యవస్థ నేడు తెలుగులో నడుస్తోంది తప్ప స్వతంత్రంగా వ్యవహరించే ఎడిటర్స్ నాకు తెలిసి ఏ దినపత్రికలో లేరు. పాఠకుల ప్రయోజనం కోసం కాక స్వప్రయోజనాల కోసమే నేటి దినపత్రికల్లోని వార్తలు వాస్తవానికి దూరంగా మార్చి రాయబడుతున్నాయి. రాజకీయ పార్టీల వారే ఛానళ్ళకి, దిన పత్రికలకి యజమానులు అవడంచేత వక్రీకరించిన వార్తలనే అలాంటి దిన పత్రికల్లో మనం చదువుతున్నాం. వీటితో రాజీపడే మనస్థత్వం కాదు కాబట్టి శ్రీ ఏ.బి.కె కెరీర్‌లో ఎన్నో విరామాలు వచ్చాయి. అయినా ఆయన తన పంథాని మార్చుకోలేదు.

## శ్రీ శాంతారాం

శ్రీ ఏ.బి.కె దగ్గర సబ్ ఎడిటర్‌గా సుప్రభాతంలో పనిచేసిన శ్రీ శాంతారాం గారితోనే నేను ఇంటరాక్ట్ అయ్యేవాడిని. ఆయన చాలా సాత్వికులు. మచిలీపట్నం వాస్తవ్యులైన శాంతారాం తండ్రి రచయిత, కమ్యూనిస్ట్ కాబట్టి అతనిలో కూడా కమ్యూనిస్ట్ భావజాలం అధికంగా ఉండేది. నా చేతివ్రాతని చక్కగా అర్థం చేసుకుని తప్పులు లేకుండా ప్రూఫ్ రీడింగ్ చేసేవారు. 2000 దాకా శ్రీ శాంతారాం సుప్రభాతం పత్రికకి ఎడిటర్‌గా ఉన్నారు. ఓ రోజు నాకు ఫోన్ చేసి శ్రీ ఏ.బి.కె వెళ్ళిపోయాక సుప్రభాతాన్ని తనే చూస్తున్నానని, ఓ సీరియల్ రాయమని అడిగితే 'ముంగిట మృత్యువు' అనే సీరియల్‌ని రాసాను. సగం అడ్వాన్స్‌గా ఇచ్చారు. ఇంకా పదిహేను వేలు ఇవ్వాలి. శ్రీ రత్తయ్య నెలలో కొన్ని రోజులు మాత్రమే గుంటూరు నుంచి వచ్చి సుప్రభాతం ఆఫీసులో ఉండేవారు. ఆయన వచ్చినప్పుడు శ్రీ శాంతారాం నాకు ఫోన్ చేసి చెప్పేవారు. ఆయన్ని మూడు సార్లు కలిసి నా బాకీ గురించి అడిగినా ప్రయోజనం లేకపోయింది. అది ఇక రాదని గ్రహించాక మళ్ళీ ఆయన్ని కలవలేదు. ఆ మిగిలిన సగం ఎగ్గొట్టారు. నాకు పారితోషికం ఎగ్గొట్టిన రెండో పత్రిక సుప్రభాతం. మొదటిది మయూరి వీక్లీ.


శ్రీ రత్తయ్య

2001లో మా రెండో అమ్మాయి ఊహని 10వ తరగతికి హైదరాబాద్ మదీనా గూడాలోని విజ్ఞాన్ వాళ్ళ రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించాను. దాని యజమాని కూడా రత్తయ్యగారే. అకడమిక్ ఇయర్ చివర్లో రత్తయ్యగారికి సుప్రభాతం తాలూకు బాకీని మా అమ్మాయి ఫీజ్‌కి అడ్జస్ట్ చేయమని కోరుతూ ఉత్తరాన్ని రాసి, దాన్ని స్కూలు ప్రిన్సిపాల్ ద్వారా పార్వర్డ్ చేయించాను. కానీ ఆయన ఆ అడ్జెస్ట్ మెంట్ జరగడానికి తగిన ఆదేశాలు ఇవ్వలేదు. ఆ బాకీ నాకు తీర్చనే లేదు.

అప్పట్లో షేర్స్‌కి మంచి బూమ్ వచ్చింది. 'షేర్ కాలమ్' అనే పత్రిక విజయవాడ నుంచి వెలువడుతూ హైదరాబాద్‌కి షిఫ్ట్ అయింది. శాంతారాం దానికి ఎడిటర్ అయ్యారు. షేర్స్ మార్కెట్ పలచబడ్డాక ఆ పత్రిక ఆగిపోయింది. ఓసారి రాజ్‌కుమార్ అనే వ్యక్తితో శాంతారాం మా ఇంటికి వచ్చి 'స్రవంతి'ని తిరిగి తీసుకురావాలని అనుకుంటున్నామని చెప్పారు. దాని టైటిల్ కందనాతి చెన్నారెడ్డిగారి దగ్గరే ఉందని, వారిని కలవమని సూచించాను. వారి నుంచి హక్కులు తీసుకున్నారు. ఐతే స్రవంతి ఒకే ఒక్క సంచిక వెలువడి ఆగిపోయింది.

2000లో వెబ్ మేగజైన్స్‌కి బూమ్ వచ్చింది. బెంగుళూరుకి చెందిన ఇండియా ఇన్ ఫో డాట్ కాం ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ 2000 ఫిబ్రవరిలో ఇండియా ఇన్‌ఫో డాట్ కామ్ అనే ఇంటర్నెట్ మేగజైన్ ని ఆరంభించింది. పంజగుట్టలోని టోపాజ్ బిల్డింగ్ దగ్గర వారి ఆఫీస్ ఉండేది. తర్వాత అది సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న సరోవర్ కాంప్లెక్స్‌లోని మై హోమ్ సరోవర్ ప్లాజాకి మారింది. శ్రీ శాంతారాం దాని తెలుగు విభాగానికి ఎడిటర్ అయ్యాక నన్ను గుర్తుంచుకుని ఏదైనా రాయమని అడిగితే 'మల్లాది మినీ మేగ్' అనే శీర్షికని మెయిన్ టైన్ చేసాను. ఇంగ్లీష్ విభాగం చూసే శ్రీ దివాకర్ అనే జర్నలిస్ట్ కూడా అక్కడ నాకు పరిచయం అయ్యారు. (అతను నేను రాసిన 'మిసెస్ పరాంకుశం' అనే నవలకి అభిమాని. దాని కాపీ అడిగితే అది అచ్చులో లేదు. అతను ప్రస్తుతం ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో పని చేస్తున్నారు. నేను ప్రెస్ క్లబ్‌కి వెళ్ళినప్పుడల్లా నాకు దివాకర్ అక్కడ కనిపించేవారు) క్రమంగా వెబ్ సైట్ బూమ్ తగ్గాక మల్లాది మినీ మేగ్‌ని నిలిపేసారు. ఆ తర్వాత ఇండియా ఇన్‌ఫో డాట్ కామ్ 'దట్స్ తెలుగు డాట్ కామ్'గా మారి, ఇప్పుడు 'ఒన్ ఇండియా డాట్ ఇన్' అయింది. 2010 ఆగస్ట్ దాకా పదకొండేళ్ళు శ్రీ శాంతారాం ఆ వెబ్ మేగజైన్‌లో పని చేసారు. ప్రస్తుతం శ్రీ శాంతారం ఏ పత్రికలో పనిచేయకుండా అనువాదకుడిగా ఉంటున్నారు.

## వెబ్ మేగజైన్స్

అదే సమయంలో నేను మరి కొన్ని వెబ్ మేగ్‌జైన్స్‌కి కూడా రాసాను. అమెరికాలోని ఓ ఎన్నారై తండ్రి రామానాయుడు అనే ఆయన కూడా ఓ వెబ్ సైట్‌ని ఆరంభించి తన కొడుకు సలహా మేరకి నా నవలని అందులో సీరియల్‌గా వేయాలని సంకల్పించారు. ఐతే నేను కోరిన పారితోషికం చెల్లించడానికి ఇష్టపడలేదు. మనిషి స్వతహాగా పొదుపరి అన్న అభిప్రాయం నాకు కలిగింది. పైగా ఆయనకి పారితోషికాల మీద అవగాహన లేదు. దాంతో నావేమీ వారి వెబ్ మేగ్‌లో రాలేదు.

2000ల లోనే అమీర్ పేటలోని మెరిడియన్ ప్లాజాలో వెబ్ ప్రపంచం డాట్ కామ్ అనే మేగజైన్‌కి కూడా రాసాను. త్వరలోనే ఇది మూత పడింది. దానికి ఆకెళ్ళ రాఘవేంద్రరావు ఎడిటర్. ఇతను మా ఇంటి దగ్గర అశోక్ నగర్‌లో ఐ ఏ ఎస్ అభ్యర్థులకి పార్ట్ టైం లెక్చరర్ గా పని చేసి, తర్వాత స్వంతంగా అలాంటి కోచింగ్ సెంటర్‌ని మొదలుపెట్టారు.

2000 సెప్టెంబర్‌లో పూనాకి చెందిన భూషణ్ కెరూర్ అనే అతను 'జూపిటర్ మేగజైన్స్' అనే సంస్థని స్థాపించాడు. హిందీ, మరాఠీ, తెలుగు, తమిళం, గుజరాతీ, ఇలా చాలా భారతీయ భాషల్లో అతను వెబ్ మేగజైన్స్‌ని ఆరంభించాడు. తెలుగులో తగిన ఎడిటర్ కోసం తనకి పరిచయం ఉన్న సి ఏ చారి (రాజా) అనే అతన్ని కాంటాక్ట్ చేసాడు. అతను రచయిత్రి సి.ఆనందారామం చిన్న కొడుకు శ్రీనివాస్‌కి మిత్రుడు. అలా నాతో అతనికి పూర్వ పరిచయం ఉంది. నేను అతనికి స్ఫురించడంతో రాజా నాకు ఫోన్ చేసారు. అతను ఉండేది మా ఇంటికి కిలోమీటర్ దూరంలోని, ఇందిరా పార్క్ ఎదురుగా ఉన్న ఎల్టైసి కాలనీలోనే. భూషణ్ భార్య మరాఠీనే ఐనా, హైదరాబాదీ. ఆమె పుట్టిల్లు శాంతినగర్‌లో ఉంది. నా అంగీకారం తీసుకున్నాక భూషణ్ హైదరాబాద్ వచ్చినప్పుడు నన్ను కలిసారు. నేను వెబ్ మేగజైన్ కంటెంట్‌ని చెబితే అది భూషణ్‌కి నచ్చింది. నెలకి ఐదువేల రూపాయలు పారితోషికం అని గుర్తు. మెటీరియల్ మొత్తం నేనే రాసి ఇవ్వాలి. ఆ పని మీద రెండు సార్లు పూనాకి వెళ్ళాను. భూషణ్ అమెరికన్ సిటిజన్. మాతృదేశం మీద అభిమానంతో అమెరికా నుంచి తిరిగి ఇండియా వచ్చి ఈ వ్యాపారం మొదలెట్టారు. పూనాలో ఖరీదైన ప్రాంతంలో ఉన్న స్నేహ ప్రభాత్ అనే అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లోని అతని అపార్ట్ మెంట్ ఖరీదు అప్పట్లో కోటి రూపాయలు అని చెప్పాడు. భూషణ్ భార్య ఇంట్లోని ఫర్నిచర్ మొత్తం అమెరికా నుంచి దిగుమతి చేసుకుంది. అపార్ట్‌మెంట్ కూడా అమెరికన్ మోడల్‌లో ప్రత్యేకంగా కట్టించుకున్నారు. అమెరికాలో వంటగది మన వంట గదిలా మరుగున ఉండక ఓపెన్‌గా ఉంటుంది.

అతను ఒకేసారి అనేక ప్రాజెక్ట్‌లని ఆరంభించి తప్పు చేసాడు. మరాఠీ సంస్కృతికి సంబంధించినవి కొన్ని షూట్ చేసి అమెరికాలోని మరాఠీలకి అమ్మడానికి వాటిని సీడీలుగా రిలీజ్ చేసారు. కానీ అతను ఆశించినట్లుగా అమెరికా మరాఠీ ఎన్నారైలు వాటిని కొనలేదు. భూషణ్ ఆశించిన ఆదాయం రాక, బేంక్ లోన్‌కి వడ్డీ కూడా కట్టలేని పరిస్థితి ఎదురవడంతో తెలుగు వెబ్ మేగ్‌ని 2001 మధ్యలో మూసేసారు. నాకు మూడు నెలల పారితోషికం ఎగ్గొట్టినా నేను బాధపడలేదు. అతను నిజాతీ గల మనిషి. ఇవ్వగలిగితే తప్పక ఇచ్చి ఉండేవాడు. బహుశ మిగిలిన భాషలవన్నీ కూడా మూసేసి ఉండచ్చు.

2003లో శృంగారం డాట్ కామ్ అనే వెబ్ మేగజైన్‌కి కాంట్రిబ్యూట్ చేయమని శ్రీ నరేష్ అనే అతను నన్ను కోరారు. దానికి ఎడిటర్ ఎవరని అడిగితే ఎవరూ ప్రొఫెషనల్ ఎడిటర్ లేరు. సిరాశ్రీ అనే అతను చూస్తుండేవారు. మర్నాడు నన్ను ఎడిటర్‌గా ఉండమని కోరారు. అప్పటి నుంచీ నేనే రాస్తున్నాను. ఆ వెబ్‌సైట్‌కి మంచి ధర వచ్చినా శ్రీ నరేష్ అమ్మడానికి ఇష్టపడలేదు పేషన్‌తో దాన్ని నడుపుతున్నారు. దానిమీద ఆదాయం లేకపోయినా కానీ కొద్ది సంవత్సరాల తర్వాత దాన్ని మాత్రం మూసేసారు. ఐదారేళ్ళ క్రితం సామాజిక సేవా దృక్పథంతో శ్రీ నరేష్ ఆరంభించిన 'ఐ డోంట్ వాంట్ డౌరీ డాట్ కామ్' విజయవంతంగా నడుస్తోంది.

2007లో శ్రీ కిరణ్‌ప్రభ పరిచయం అయ్యాక ఆయన లాభాపేక్ష లేకుండా సేవగా నడిపే కౌముది డాట్ నెట్‌కి నా పాత నవలలని సీరియల్‌గా వేయడానికి ఇచ్చాను. డైరెక్ట్‌గా రాసే దీన్ని ఇప్పుడూ మీరు అందులోనే చదువుతున్నారు.

చావా కిరణ్ అనే అతను అమెరికాలో కొంతకాలం పనిచేసి వెనక్కి వచ్చాక 2011లో కినిగె డాట్ కాం అనే కమర్షియల్ సైట్‌ని ఆరంభించారు. దాన్లో నేను రాసిన కొన్ని నవలల సాఫ్ట్ కాపీ ఉన్నాయి. వాటిని కొనుక్కోవచ్చు. లేదా అద్దెకి తీసుకుని చదువుకోవచ్చు. ఆ ఆదాయంలో కొంత భాగం నాకు ఇస్తారు. ముఖ్యంగా తెలుగు పుస్తకాలు అందుబాటులో లేని ఎన్నారైలకి ఈ సైట్ ఉపయోగిస్తుంది.

## ఉదయం

ఉదయం దినపత్రిక ఆవిష్కరణ 1985 ఆగస్ట్‌లో జరిగింది. ఈనాడు రామోజీరావు గారితో పోటీపడి శ్రీ దాసరి నారాయణరావు ఉదయం సంస్థని స్థాపించారని అప్పట్లో చెప్పుకునేవారు. దాని యం.డి కొండపల్లి రామకృష్ణ ప్రసాద్. దానికి కూడా శ్రీ ఏ.బి.కె మొదటి ఎడిటర్. దేవీ ప్రియ ఆదివారం అనుబంధం ఎడిటర్. గతంలో ప్రజాతంత్ర అనే వారపత్రికని దేవీ ప్రియ ఎడిట్ చేసినప్పుడు నేనా పత్రికకి రాసినప్పటి నుంచీ వారు నాకు పరిచయం. కానీ ఉదయం పత్రికని ఆరంభించిన కొద్దికాలానికి ఎప్పటిలా ఏ.బి.కె నిష్క్రమించారు. ఉదయానికి హైదరాబాద్, తిరుపతి ఎడిషన్స్ మాత్రమే ఉంటే, ఈనాడుకి హైదరాబాద్, వైజాగ్, తిరుపతి, విజయవాడ (నాలుగు ఎడిషన్స్) ఉండేవి. ఐనా త్వరలోనే ఈనాడు సర్క్యులేషన్‌కి చాలా దగ్గరగా వచ్చింది. ఆ పోటీని తట్టుకోడానికే రామోజీరావు ఈనాడు టాబ్లాయిడ్ జిల్లా ఎడిషన్స్‌ని ఆరంభించారు.


శ్రీ దాసరి నారాయణరావు

*టాబ్లాయిడ్స్ చరిత్ర*

నిజానికి ఈ టాబ్లాయిడ్ పత్రికని తెలుగులో మొదటగా ఆరంభించింది ఆంధ్రభూమి డైలీ వైజాగ్ ఎడిషన్ న్యూస్ ఎడిటర్ శ్రీ రాజ్‌గోపాల్. ఇది అతని ఇన్‌వెన్షన్. టైమ్స్ ఆఫ్ ఇండియా వారు సెక్షన్ టు అనే పేర స్థానిక బాంబే వార్తలని టాబ్లాయిడ్ సైజ్‌లో ఇచ్చేవారు. దాన్ని చూసిన శ్రీ యం రాజగోపాల్ (హాసం రాజా తమ్ముడు) డిసెంబర్ ఇరవై ఆరు 1988న విజయవాడలో రంగా హత్య జరిగినప్పుడు మొదటిసారి నాలుగు పేజీల టేబ్లాయిడ్‌లో ఆ వార్తని వైజాగ్‌లో బ్లాక్ అండ్ వైట్‌లో కవర్ చేసారు. దాని రెస్పాన్స్‌ని చూసి జిల్లా వార్తలకి టాబ్లాయిడ్ తెద్దామని రాజ్‌గోపాల్ ఏ.బి.కె గారికి సూచిస్తే ఆయన అంగీకరించలేదు. కానీ రాజ్ గోపాల్‌కి టాబ్లాయిడ్ మీద గల విశ్వాసంతో వైజాగ్ భూమి సి ఇ వో సత్యనారాయణ రెడ్డిగారితో మాట్లాడించి ఏబికె గారి చేత వప్పించారు. ఎనిమిది పేజీల ఆ టేబ్లాయిడ్ కి 'భూమి అనుదిన అనుబంధం' అనే పేరు పెట్టారు. తర్వాత మూడు జిల్లాలకి కలిపి ఓ టేబ్లాయిడ్ తెచ్చారు. వైజాగ్ సిటీలో, ఉత్తరాంధ్రాలోని కొన్ని సెంటర్లలో ఈనాడు కన్నా ఆంధ్రభూమి డైలీకి ఎక్కువ సర్క్యులేషన్ ఉందని అప్పట్లో శ్రీ రాజ్ గోపాల్ నాతో అనేక సందర్భాల్లో చెప్పారు. అందుకు కారణం కొంతదాకా ఎడిట్ పేజీలో రాజ్ గోపాల్ చేసిన ప్రయోగం. ఎడిట్ పేజీ ఎప్పుడూ సామాన్య పాఠకులకి కొరుకుడు పడనంత గంభీరంగా ఉండేది. కానీ రాజ్‌గోపాల్ ఆ పేజీలో ఓ రోజు డాక్టర్ వ్యాసాలు, ఓ రోజు బి.వి.పట్టాభిరాం జగమే మాయ, భరాగో 'కథనకుతూహలం', రోజూ కాళీపట్నం రామారావు 'నేటి కథ', నేను రాసిన 'కృష్ణశబ్దం' మొదలైనవి వేసేవారు. అవి కూడా సర్క్యులేషన్‌కి సహాయం చేసాయని రాజ్ గోపాల్ అప్పట్లో చెప్పేవారు. ఐతే టేబ్లాయిడ్‌ని హైదరాబాద్ ఎడిషన్‌కి అడాప్ట్ చేయలేదు. ఆంధ్రభూమి వైజాగ్ ఎడిటోరియల్ స్టాఫ్ వారి ఇష్టప్రకారం పత్రికని తెస్తే, హైదరాబాద్ సిబ్బంది వారి ఇష్టప్రకారం తెచ్చేవారు. 'మా వాళ్ళు ఎవరికి వారు సామంత రాజులు' అనేవారు రాజగోపాల్. 1996లో కంప్యూటర్ టెక్నాలజీని మొదటగా డెక్కన్ క్రానికల్ గ్రూప్ వాడినప్పుడు అమరిన సౌలభ్యం వల్ల వైజాగ్ ఎడిషన్ కూడా హైదరాబాదులోని ఎడిటర్ పరిధిలోకి రావడంతో ఇప్పుడు ఆ 'సామంత రాజుల' పద్ధతి లేదు.


శ్రీ రాజ్ గోపాల్

జిల్లా లేదా స్థానిక వార్తల టాబ్లాయిడ్ వల్ల మండలానికో విలేఖరి ఏర్పడి వారి ఉద్యోగావకాశాలు బాగా పెరిగాయి. అదే సమయంలో ఒక జిల్లా వార్త ఇంకో జిల్లాకి తెలీని పరిస్థితి ఏర్పడిందనే విమర్శ అప్పట్లో వచ్చింది. నేడు హైదరాబాద్‌లోనే ఏ ప్రాంతంలో సరఫరా అయ్యే దినపత్రికకి ఆ ప్రాంతపు వార్తల టాబ్లాయిడ్ వచ్చి వార్తలు లిమిట్ అయిపోయిన పరిస్థితి ఉంది.

ఈ విషయాలు రాయబోయే ముందు శ్రీ రాజ్ గోపాల్‌తో మాట్లాడితే 'నిజమే. ఢిల్లీ వార్తలని, గల్లీ వార్తలని వేరు చేయడం మంచైనా లేదా చెడైనా దీనికి ఆద్యుడ్ని నేనే కాబట్టి దానికి నా బాధ్యత కొంతదాకా ఉంది.' అని రాజ్ గోపాల్ ఒప్పుకున్నారు.

*(మిగిలిన జ్ఞాపకాలు వచ్చేనెల)*

**Click here to share your comments on this story**